ప్రజాశక్తి

ఆదివారం 19 మే 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

రూ.కోట్లు మింగే స్కెచ్ !

◆ వర్షాలొస్తున్నా.. గెడ్డలు, కాల్వల పూడికతీతలపై ప్రతిపాదనలు కరువు

◆ ఎన్నికల కోడ్ సాకు చూపుతున్న జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు

నగరంలోని ఓ గెడ్డలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పూడికతీత... ప్రతి ఏటా ఎండాకాలం ముగిసే దశలో జరగాల్సిన పని అది. కానీ ఎందుకో తాత్సారం. వర్షాకాలం వస్తుందంటే మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి. కానీ ఏటా అలా జరగడం లేదు. దీంతో వర్షాలు వచ్చాయంటే చాలు నగరంలోని గెడ్డలు, కాలువలు పొంగిపొర్లి కాలనీలపై పడుతున్నాయి. వీటికితోడు వర్షపు నీరు రోడ్లపై ప్రవహించి నగర జీవులను అవస్థలకు గురిచేస్తోంది. ఇది కొన్నేళ్లుగా జివిఎంసిలో నిత్యకృత్యంగా మారింది. పూడికతీత పనుల్లోనూ రూ.కోట్లు మింగే స్కెచ్ దీని వెనుక దాగి ఉందన్న చర్చ నగరంలో నడుస్తోంది.

నగరంలోని సుమారు 80 కాలువలు, ప్రధాన గెడ్డల్లో కూరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వర్షాకాలంలో రోడ్లపైకి చేరుతాయి. అవి జనం మిగతా 2లో..

జివిఎంసి చీఫ్ ఇంజినీర్ ఏమన్నారంటే.. ?

జివిఎంసి చీఫ్ ఇంజినీర్ రవికృష్ణరాజును కాలువలు, గెడ్డల్లో సిల్ట్ క్లీనింగ్ పనులపై శనివారం వివరణ కోరగా ఎలాంటి ప్రతిపాదనా చేయలేదని తెలిపారు. వర్షాలు ఎలాగూ ఆలస్యం అవుతాయన్న ధీమాను వ్యక్తం చేశారు. కౌన్సిల్ ఆమోదం కూడా ఉండాలని, మార్చి 15 నుంచి ఎన్నికల కోడ్ ఉండడంతో ఎలాంటి అంచనాలు, ప్రతిపాదనలూ తయారు చేయలేదని, ఈ విషయం కమిషనర్ దృష్టిలో ఉందని తెలిపారు. అత్యవసరంగా జరగాల్సిన పనులే అయినా వ్యర్థాలు ఏ గెడ్డ, ఏ కాలువల్లో ఎంతెంత ఉన్నాయన్న అంచనాలు తయారీ జరగలేదన్నారు. జివిఎంసి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో చేపడతామన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో..

నేడు సుందరయ్య వర్ధంతి సభ

'మతోన్మాదం - రాజ్యాంగం - సవాళ్లు'పై స్మారకోపన్యాసం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరంలోని డాబాగార్డెన్స్‌లోగల అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కమ్యూనిస్టు యోధులు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ జరుగనుంది. ఈ సందర్భంగా 'మతోన్మాదం - రాజ్యాంగం - సవాళ్లు' అన్న అంశంపై స్మారకోపన్యాసం ఉంటుంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడనున్నారు.

సుందరయ్య అభిమానులు, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో కోరారు

వార్త మెయిన్‌లో..

రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

వేసవి ప్రత్యేక రైళ్లు పొడిగింపు

▶ వార్త 2లో..

నేడు ఎర్నిమాంబ పండగ

▶ వార్త 8లో..

చలివేంద్రాలు సరే.. చలువ పందిళ్లు ఏవీ...

▶ వార్త 3లో..

దీక్షల్లో కూర్చున్న సిఐటియు అక్కయ్యపాలెం జోన్ నాయకులు

ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఇప్పటికైనా స్వస్తి చెప్పాలని విశాఖపట్నం మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన మిగతా 2లో..

ఖరీఫ్‌కు సమాయత్తం

◆ 1.85 లక్షల ఎకరాల్లో సాగు అంచనా ◆ 23,678 క్వింటాళ్ల విత్తనాల సరఫరా

దుక్కు దున్నుతున్న రైతు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ ప్రణాళికను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. వివిధ పంటల సాగు లక్ష్యాలను నిర్దేశించుకుంది. దీనికి అనుగుణంగా విత్తన సరఫరాపై ప్రతిపాదనలు తయారుచేసింది. జిల్లాలోని 24 మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 1.88 లక్షల ఎకరాలకుగానూ 1.85 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు జరుగుతుందని వ్యవసాయశాఖాధికారులు అంచనావేశారు. దీంట్లో వరి సాగు ప్రధాన భాగంగా వుంది. రెండో స్థానంలోవున్న చెరుకు సాగు క్రమంగా తగ్గుతోంది. తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సహకార చక్కెర ఫ్యాక్టరీల క్రషింగ్ నిలిపివేయడంతో చెరుకు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. గతేడాది 60 వేల ఎకరాల మేర చెరుకు సాధారణ సాగు ఉండగా ఈ ఏడాది 48,677 ఎకరాలకు పడిపోయింది. ఈ ఖరీఫ్‌లో ప్రధాన పంటల్లో వరి 1.41 లక్షల ఎకరాలు, చెరుకు 37,500 ఎకరాలు, సజ్జలు 2,250 ఎకరాలు, మొక్కజొన్న 200 ఎకరాలు, కందులు, 375 ఎకరాలు, మిగతా 2లో..

సకాలంలో వరి విత్తనాల పంపిణీ

ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటల సాగు విస్తీర్ణ ప్రణాళిక తయారుచేశాం. దీనికనుగుణంగా విత్తనాలు సరఫరాచేయనున్నాం. ఆర్‌జెఎల్‌కు బదులు వరి దిగుబడులు వచ్చే ప్రత్యామ్నాయ విత్తనాల వైపు రైతులు వెళితే మంచి ఫలితాలు వస్తాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు అందజేయనున్నాం.

బి.మోహనరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, అనకాపల్లి

మొదటి పేజీ తరువాయి..

రూ.కోట్లు మింగే స్కెచ్ !

ఆరోగ్యాలపై దాడి చేస్తాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. వర్షాకాలంలో మామూలుగా వచ్చే రోగాలు కంటే జివిఎంసి ప్రదర్శించే అలక్ష్యంతో వచ్చే రోగాలే అధికమన్న విమర్శలూ ఉన్నాయి. వాస్తవానికి గెడ్డలు, కాలువల్లో పేరుకుపోయేటువంటి వ్యర్థాల (సిల్టు)ను వెలికితీసే పని జివిఎంసి ఇంజినీరింగ్ విభాగంపై ఉంది. ఎండా కాలం ముగుస్తున్న దశలో ఈ పనులకు సంబంధించి లెక్క, ప్రతిపాదనలు, టెండర్లు సిద్ధం చేయాల్సి ఉన్నా ఒకటి రెండు వర్షాల వరకూ ఆగి ఆ తర్వాత పనులను తూతూ మంత్రంగా ముగించేసే పరిస్థితులు ఏటా దర్శనమిస్తున్నాయి. దీంతో నగర జనాభాకు అవస్థలు, ఇంజినీరింగ్‌లో కొంతమందికి, పనులు చేసే కాంట్రాక్టర్లకు కాసులు మిగులుతున్నాయి. జివిఎంసిలో ఏటా జరిగే సాధారణ కుంభకోణమే ఈ పూడికతీతల వ్యవహారమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పనుల విలువ రూ.10 కోట్లు

వర్షాలు ప్రారంభం కాకముందే నగరంలోని ప్రధాన గెడ్డలైన ఎర్రిగెడ్డ, గంగుల గెడ్డ, ఓల్డ్ టౌన్‌లోని ఎస్ఎల్ కెనాల్, జ్ఞానాపురం, మల్కాపురం గెడ్డలు, మధురవాడ, రుషికొండ, సాగర్‌నగర్, కొమ్మాది వంటి చోట్ల ప్రవహించే కాలువలు, గెడ్డల్లో టన్నుల కొద్దీ వేస్టేజీ (వ్యర్థాలు)ను క్లీన్ చేయాలి. సుమారు రూ.10 కోట్లు వీటికి ఏటా ఖర్చుచేస్తూ ఉంటారు. సకాలంలో ఏనాడూ పనులు ప్రారంభించిన చరిత్ర జివిఎంసికి లేదన్న విమర్శలు ఉన్నాయి. ఏదో ఒక సాకుతో వర్షాకాలం ప్రారంభమై రెండు మూడు వర్షాల తర్వాత ఈ పనులు చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. దీనివల్ల అంచనాల్లో సగం కాంట్రాక్టర్లు మింగుతున్నారు. వర్షాలు పడ్డాక సగం వ్యర్థాలు సముద్రంలోకి, ఇంకొంచెం జనావాసాలు, రోడ్లపైకి ఎలాగూ వచ్చేస్తాయి. అప్పుడు పని కూడా వీరికి సులభం. వాస్తవానికి ఎండాకాలం ముగుస్తుందన్న దశలోనే గెడ్డల్లో సిల్ట్‌పై స్పష్టమైన నివేదికలుండాలి. అత్యవసర పనుల్లో గెడ్డల్లో పూడికతీతల పనీ ఉన్నా ఎన్నికల కోడ్‌ను ఈ దఫా అధికారులు అడ్డంగా చూపుతున్నారు.

ఖరీఫ్‌కు సమాయత్తం

పెసర 625 ఎకరాలు, మినుములు 625 ఎకరాలు, వేరుశనగ 250 ఎకరాలు, నువ్వులు 2,125 ఎకరాలు, పత్తి 375 ఎకరాల్లో సాగు కానుంది.

విత్తన సరఫరా ఇలా..

ఖరీఫ్ సాగును పరిగణలోకి తీసుకొని వివిధ రకాల విత్తనాలు 23,678 క్వింటాళ్లు అవసరమని వ్యవసాయ శాఖాధికారులు గుర్తించారు. వరి 22,376 క్వింటాళ్లు, వేరుశనగ 140, నువ్వులు 11, చిరుధాన్యాలు నాలుగు, అపరాలు 92 క్వింటాళ్లను సరఫరా చేయడానికి ప్రణాళిక తయారుచేశారు. ఎరువుల వినియోగం తగ్గించి, భూసారాన్ని పెంచేందుకు ఉపయోగించే పచ్చిరొట్ట విత్తనాలు 1056 క్వింటాళ్లు సరఫరా చేయాలని భావిస్తున్నారు. రైతులు తమ భూముల్లో కావాల్సిన విత్తనాలు తయారు చేసుకొనేందుకు వరి పంటలో 218 క్వింటాళ్ల కొత్త వంగడాల సరఫరాకు వ్యవసాయ పరిశోధన కేంద్రాలకు నివేదిక సమర్పించారు. ఈ ఏడాది మేలో వర్షాలు పడ్డంతో ఖరీఫ్ పంటల సాగు గతేడాది కంటే తొందరగా ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో పొలాలు దుక్కులు దున్ని రైతులు సిద్ధంచేస్తున్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి

రిలే దీక్షలు శనివారానికి 1143వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు, ప్రజా సంఘాల అక్కయ్యపాలెం జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి ప్రజలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పనున్నారన్నారు. సిఐటియు సీనియర్ నాయకులు కె.స్వతంత్ర కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజల ఆస్తి అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ వీటిలో ప్రత్యేకమైనదని గుర్తుచేశారు. అనేక పోరాటాలతో, త్యాగాలతో ఉక్కు కర్మాగారం ఏర్పాటైందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిందన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం దీనిని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఆయన కోరారు. దీక్షల్లో నాయకులు ఎన్.ప్రకాశరావు, లక్ష్మీపతి, యుఎస్ఎన్.రాజు తదితరులు కూర్చున్నారు.

గురుస్థానం ప్లే స్కూల్ మూడో బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గురుస్థానం - ది ప్లే స్కూల్ మూడో బ్రాంచ్‌ని శనివారం ఉదయం ఎంవిపి.కాలనీ సెక్టార్-11లో ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ టాస్క్‌ఫోర్స్ జివి.ప్రసాదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలో ప్రీస్కూల్ ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. గురుస్థానం పాఠశాలలు కొత్త శాఖలతో తల్లిదండ్రులకు చేరువ కావడం చాలా సంతోషకరమన్నారు. సంస్థ డైరెక్టర్ ఎస్.ఖాన్ మాట్లాడుతూ మరిన్ని శాఖలను విస్తరించడం ద్వారా పిల్లలకు ఉత్తమ విద్యను అందించడం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని అన్నారు. ఆరు సంవత్సరాల వ్యవధిలో నగరంలో మూడు శాఖలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషా.కె, ప్రిన్సిపల్ గౌసియా బేగం, ఏక్యూజె గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ ఛైర్మన్ సిద్ధిఖీ, వైస్ ఛైర్మన్ ఫరూఖీ, కోశాధికారి జాఫ్రీ, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గురుస్థానం మూడో బ్రాంచిని ప్రారంభిస్తున్న ప్రసాదరావు

ఎవరు గెలిస్తే ఏమి..?

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు జరిగి వారం రోజులవుతోంది. మరికొద్ది రోజుల్లో అభ్యర్థుల ఫలితాలు రానున్నాయి. పోలింగ్ కంటే, అనంతరమే అంతటా ఎన్నికల వేడివుంది. ప్రభుత్వ వ్యతిరేకతకు పెరిగిన పోలింగ్ శాతమే సంకేతమని కూటమి కోడై కూస్తోంది. ప్రభుత్వ అనుకూలతకు జనం ఇవ్వబోయే తీర్పని వైసిపి చెప్పుకుంటోంది. మరొక అడుగుముందుకేసి మంత్రి బొత్స సత్యనారాయణ వచ్చే నెల 9న విశాఖలో ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారని విలేకరుల సమావేశంలో చెప్పగా, వైసిపికి ఓటమి భయం పట్టుకొని, గెలుస్తామని చెప్పుకుంటోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. భయమెవరికి ? ధైర్యమెవరిలో వుందోగానీ, జయాపజయాలపై సంక్లిష్టత ఉభయుల్లోనూ కన్పిస్తోంది. ఫలితాలపై క్యాడర్‌లోని పిరికితనం పోగొట్టేందుకు ఇరువురూ రాజకీయ చతురత ప్రదర్శించి, వారిని నిలబెట్టుకొనే పనిలో వున్నారు. ఈసారి వైసిపి, కూటమిలోని టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థులు డబ్బు పంపకంలో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్న వివాదాలు పెద్దగా లేవు. ఒకరిచ్చిన డబ్బులు కంటే మరొకరు ఎక్కువ ఇచ్చినా సర్దుకుపోయారు తప్పితే అడ్డుకొనే పని చేయలేదు.

ఎన్నికల్లో గెలవడానికి తమ దగ్గరవున్న సాధన సంపత్తినంతా ఉపయోగించారు తప్పితే, స్వాభావికంగా ప్రజలను ఉద్ధరించాలనే ఆలోచనాపరులు వీరు కాదుగనుక డబ్బు పంపిణీలో పోటీపడ్డారు. సందట్లో సడేమియాలాగా ఎవరికొచ్చిన అవకాశాన్ని వారు చక్కగా ఉపయోగించుకొని శక్తిమేరకు ఎన్నికలను సొమ్ము చేసుకున్నారు. గెలుపోటములపై వైసిపి, కూటమి చూపుతున్న శ్రద్ధ విశాఖకు వన్నెతెచ్చిన స్టీల్‌ప్లాంట్‌పై

కానరాలేదు. ప్లాంట్‌ను కాపాడుకోవాలన్న ఆకాంక్ష ఆ పార్టీల అభ్యర్థుల్లో ఏ మాత్రమూ కన్పించడంలేదు. స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా జరుగుతున్న సుదీర్ఘ పోరాటంలో గాజువాక, విశాఖ పశ్చిమ నుంచి తమ అభ్యర్థులను బరిలో పెట్టిన సిపిఎం, సిపిఐ మినహా మిగిలిన పార్టీలేవీ మనస్ఫూర్తిగా భాగస్వామికాలేదు. అమ్మితే వచ్చే లాభం లెక్కేసుకొనేవారు తప్పితే స్టీల్‌ప్లాంట్ చేజారితే జరిగే నష్టం ప్రధాన రాజకీయ పార్టీలకు పట్టడంలేదు. అందుకనే.. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన బిజెపిని ఇప్పటికీ భుజం నుంచి దించే ప్రయత్నం వైసిపి చేయడంలేదు. ద్రోహిగా తెలుగునాట ముద్రపడ్డ బిజెపితో చెలిమిచేసి విద్రోహ పాత్ర టిడిపి, జనసేన పోషించి వెన్నుముకలేని పార్టీలుగా తయారయ్యాయి

అధికారంలోకి వచ్చిన వెంటనే వైసిపి ప్రభుత్వ అరాచకాలు, అక్రమాలపై విచారణచేసి చర్యలు తీసుకుంటామని విశాఖ గడ్డపై మాట్లాడిన బొండా ఉమా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని చెప్పకపోవడం టిడిపి విధాన భ్రష్టత్వానికి పరాకాష్ట. ఇకపోతే, అధికారమెవరి చేతికొచ్చినా భూ ఆక్రమణలు ఆగిపోతాయన్న భ్రమ ఇక్కడ ప్రజలకు లేదు.

టిడిపి, వైసిపి ప్రభుత్వాలు విశాఖ భూ ఆక్రమణలపై సిట్‌ను నియమించి, తమ వాళ్లను కాపాడుకోవడానికి అదిచ్చిన నివేదికను ఎలా బుట్టదాఖలు చేశాయో ప్రజలకు గుర్తుంది. తమ పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌కు చెందిన గీతం యూనివర్సిటీ భూ ఆక్రమణల అప్రతిష్ట మూటగట్టుకున్న విషయం బొండాకు తెలుసో, తెలీదో. భూ ఆక్రమణలో వీరెవరూ మినహాయింపు కాదు. అధికారమెవరు చేజిక్కించుకున్నా, ఎవరి చేజారినా ప్రజలకు ఈతి బాధలు తప్పవు. ఈ ప్రజాకంటక పాలనలో తమ ముందున్న తాత్కాలిక, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం శ్రామిక ప్రజలు సంఘటిత పోరాటాలు నిర్వహించక తప్పదు.

వేసవి ప్రత్యేక రైళ్లు పొడిగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవి కాలంలో ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ మేరకు 08321 సంబల్‌పూర్ - ఎస్ఎంవి బెంగళూరు ప్రత్యేక రైలు మే 30 నుంచి జూన్ 27 వరకు ప్రతి గురువారం సాయంత్రం 18.45 గంటలకు సంబల్‌పూర్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 04.55 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 05.00 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 23.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. 08322 ఎస్ఎంవి బెంగళూరు - సంబల్‌పూర్ ప్రత్యేక రైలు జూన్ 1 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం అర్ధరాత్రి 01.15 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు నుంచి బయలుదేరి అదేరోజు రాత్రి 20.30 గంటలకు దువ్వాడకు చేరుకుని మరలా 20.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 06.30 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు బార్‌ఘర్ రోడ్డు, బలంగీర్, తిట్లాగఢ్, కేసింగ, మునిగూడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు, గూడూరు, కష్ణరాజ్‌పేట, జోలార్, రేణిగుంట మీదుగా ప్రయాణిస్తాయి.

08325 సంబల్‌పూర్ - కాచిగూడ సమ్మర్ స్పెషల్ మే 27 నుంచి జూన్ 24 వరకు ప్రతి సోమవారం రాత్రి 21.00 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి మరుసటి ఉదయం 07.20 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 07.25 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 21.50 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. 08326 కాచిగూడ - సంబల్‌పూర్ సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మే 28 నుండి జూన్ 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 23.20 గంటలకు కాచిగూడలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు దువ్వాడ చేరుకుని 12.35 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 23.45 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు బర్‌గఢ్ రోడ్డు, బలంగీర్, తిట్లగఢ్, కేసింగ, మునిగూడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి, తుని, పిఠాపురం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, చెర్లపల్లి, మల్కాజిగిరి మీదుగా ప్రయాణిస్తాయి.

23న వేలం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్థానిక ద్వారకా బస్సు కాంప్లెక్స్‌లో ఉన్న పార్సిల్ ఆఫీసులో భద్రపరచబడి, చాలా కాలంగా ఎవరూ తిరిగి తీసుకు వెళ్ళని కొన్ని వస్తువులకు బహిరంగ వేలం వేస్తున్నట్లు జిల్లా రవాణా అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న ఉదయం 11 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ పార్సిల్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన పాటదారులు వచ్చి పాల్గొనాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, విజయవాడ
(A.P.STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT: VIJAYAWADA)

F.A.I.A.No. 422 of 2024
IN
F.A.No.723 of 2023

వారి మధ్య (Between)

1. శ్రీరామ్‌లైఫ్ ఇన్సూరెన్స్ కం., లిమిటెడ్, రిప్రజెంటెడ్ బై ది బ్రాంచ్ మేనేజర్, జోనల్ ఆఫీస్, డోర్ నెం. 14-1-2/బి, మొదటి అంతస్తు, మహారాణి పేట, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ 530002.
2. శ్రీరామ్‌లైఫ్ ఇన్సూరెన్స్ కం., లిమిటెడ్, రిప్రజెంటెడ్ బై ది మేనేజింగ్ డైరెక్టర్, రిజిస్టర్ ఆఫీస్, 5 వ అంతస్తు, ప్లాట్ నెం. 31 & 32, రామ్‌కి సెలీనియమ్, ఆంధ్రబ్యాంకు ట్రైనింగ్ సెంటర్ ప్రక్కన, ఫైనాన్షియల్ జిల్లా, గచ్చిబౌలీ, హైదరాబాదు, తెలంగాణా, - 500032.

...పిటీషనర్స్ (Petitioners/Appellants)

మరియు (And)

1. శ్రీ చిన సంజీవరావు, హిందూ, వయస్సు -45, డోర్ నెం. 4-87/ఎ, తిమ్మరాజు పేట పోస్ట్, పెదపాడు, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ 531033.

...ప్రతివాది (Respodent)

నోటీసు (NOTICE)

పై ఉదహరించిన పిటీషనర్స్ F.A.I.A. 422 of 2024 IN F.A.No.723 of 2023, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, విజయవాడ యందు మొదటి అపీల్‌ను వేసియున్నారు. ఈ మొదటి అపీల్‌లో తమకి నోటీసులు పంపియున్నారు. కానీ ప్రతివాది అయిన మీకు అవి ముట్టలేదు. అందువలన పేపరు పబ్లికేషన్ ద్వారా ప్రతివాదికి నోటీసులు ఇవ్వమని పై కమీషన్ వారు ఉత్తర్వులు జారీ చేసినారు. పై మొదటి అపీల్ F.A.I.A.422 of 2024 IN F.A.No.723 of 2023 తేది 30-05-2024 మీ యొక్క హాజరు కోసం వాయిదా వేసియున్నారు. కావునా తేది. 30-05-2024న ఉ॥ గం॥ 10.30ని.లకు మీరు కానీ మీ యొక్క న్యాయవాది కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, విజయవాడ, 1వ అంతస్తు, శ్రీ సాయి టవర్స్, అశోక్ నగర్, విజయవాడ-520007. ఎదుట హాజరు అయ్యి తమ యొక్క వాదనలు విన్నవించుకోగలరు. అటుల లేని పక్షంలో కోర్టు వారు మొదటి అపీల్‌ను ఏకపక్షంగా విచారించెదరు.

సం/- కె.రాజేశ్వరరావు, LLM, PGDCL & IPR కౌన్సిల్ ఫర్ ఫిటీషనర్స్
గద్దె విజయచందర్, అడ్వకేట్స్
ఆఫీస్ 8-3-222/12/A/9, కె.ఎన్.ఆర్ ప్లాజా, మధురానగర్ మెట్రోస్టేషన్, మధురానగర్, యూసఫ్‌గుడా మెయిన్ రోడ్డు, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రం. 500 083.

IN THE HON'BLE COURT OF THE FAMILY JUDGE CUM V ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
F.C.O.P. 2012/2023

Between:
Smt. Allam (Anaparthy) Nookaratnam ...Petitioner
And:
Sri Allam Srinu ...Respondent

NOTICE

To, **The Respondent:**
Sri Allam Srinu, S/o. Ramana,
Presently R/at D.No.65-3-114,
Koramandal Gate, Near Sampath Vinayaka Temple,
Nehru Nagar, Sriharipuram,
Visakhapatnam.

Take notice that the petitioner filed the above O.P. for decree of divorce by dissolving the marriage on the ground of cruelty and harassment, which was taken place between you and the petitioner on 28-05-2015. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **28-06-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
M. SASI SEKHAR NAIDU,
Advocate
Visakhapatnam,
Cell: 9885749373.

చలివేంద్రాలు సరే.. చలువ పందిళ్లు ఏవీ...

ప్రజాశక్తి -భీమునిపట్నం : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు జివిఎంసి ఒకటో జోన్ ఆధ్వర్యాన భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో 14 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు వీటి నిర్వహణకు రూ.8 లక్షలు కేటాయించారు. ఒక్కో చలివేంద్రం నిర్వహణకు నెలకు రూ.19 వేలు అన్న మాట. తాటాకు కమ్మలతో పందిరి వేసి, తాగు నీటి కోసం ప్లాస్టిక్ డ్రమ్ము, రెండు మట్టి కుండలు, నాలుగైదు ప్లాస్టిక్ గ్లాసులు ఏర్పాటుచేశారు. అనేక చోట్ల చలివేంద్రం వద్దకు దాహార్తి తీర్చుకునేందుకు వచ్చే వారికి నీరు ఇచ్చే వారు లేరు. కుండపై ఉన్న ప్లాస్టిక్ గ్లాసుతో నీరు తీసుకుని దాహార్తి తీర్చుకోవడమే. ఈ ఏడాది ప్రత్యేకత ఏంటంటే ప్రతి చలివేంద్రం వద్ద సిమెంట్ తొట్టెను ఏర్పాటు చేసి అందులో నీరు నిల్వ చేశారు. పశు పక్ష్యాదుల గొంతు తడిపేందుకు వీటిని ఏర్పాటు చేయడం అభినందించాల్సిందే మరి.

ప్రజా ధనం... కాంట్రాక్టర్ల పరం?

వేసవి దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటుచేయడాన్ని అభినందించాల్సిందే. అదే సందర్భంలో ఒక్కో చలివేంద్రం నిర్వహణకు నెలకు రూ.19 వేలు ఖర్చు చేయడం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడమేనన్న విమర్శలు ఉన్నాయి. లేనిపోని పన్నులు వేసి ప్రజల నుంచి ముక్కు పిండి పన్నులు వసూలు చేస్తున్న జివిఎంసి యంత్రాంగం అలా పోగేసిన ప్రజాధనాన్ని ఇలా కొద్ది మంది కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చేలా కార్యక్రమాలు నిర్వహించడంపై స్థానికులు మండిపడుతున్నారు.

చలువ పందిళ్లు ఏవీ?

చలివేంద్రాలు ఏర్పాటుచేశారు సరే, చలువ పందిళ్లు (గ్రీన్ షెల్టర్లు) మాటేమిటని ప్రజలు, ప్రయాణికులు అడుగుతున్నారు. వేసవి నేపథ్యంలో ప్రజలు, ప్రయాణికులు వడ దెబ్బకు గురికాకుండా విశ్రాంతి తీసుకునేందుకు జివిఎంసి ఒకటో జోన్ అధికారులు ఈ ఏడాది ఎక్కడా గ్రీన్‌షెల్టర్లు ఏర్పాటు చేయలేదు. చలివేంద్రాలతో పాటు ఏక కాలంలో గ్రీన్ షెల్టర్లను కూడా ఏర్పాటుచేసి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

తగరపువలసలో ఏర్పాటుచేసిన చలివేంద్రం

నేరాలు ఘోరాలు

వేధింపులపై వివాహిత ఫిర్యాదు

ప్రజాశక్తి -మధురవాడ : వివాహమైన మూడేళ్ల తర్వాత అత్తింటి వారు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఓ వివాహిత పిఎం.పాలెం స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి మధురవాడ రేవళ్లపాలేనికి చెందిన వ్యక్తితో 2020వ సంవత్సరంలో వివాహమైంది. వీరికి రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. అత్తింటి వారికి పెళ్లి సమయంలో యువతి కుటుంబీకులు రూ.3 లక్షల నగదు, 5 తులాల బంగారం, కిలో వెండి వస్తువులు కట్నంగా ఇచ్చారు. కొంత కాలంగా అదనపు కట్నం తీసుకొని రావాలని భర్త, అత్తమామలు వేధిస్తున్నారు. దీనిపై పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినా ఎలాంటి మార్పు రాకపోవడంతో వివాహిత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

21 నుంచి పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : భూ సారం పెంపుదలకు, యూరియా వాడకాన్ని తగ్గించేందుకు దోహదపడే పచ్చి రొట్ట విత్తనాలను ఈ నెల 21వ తేదీ నుంచి స్థానిక వ్యవసాయ డివిజన్ పరిధిలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమిలి మండలానికి 12 క్వింటాళ్ల జీలుగు, కట్టె జనుము, 2.6 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆనందపురం మండలంలో 22 క్వింటాళ్ల జీలుగు, 3.5 క్వింటాళ్ల కట్టె జనుము, 3.1 క్వింటాళ్ల పిల్లి పెసర, పద్మనాభం మండలంలో 54.3 క్వింటాళ్ల జీలుగ, 32.4 క్వింటాళ్ల కట్టె జనుము, 6 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. జీలుగ, కట్టె జనుము కిలో రూ.88 ఖరీదు కాగా సబ్సిడీ మినహా రూ.44కు, పిల్లి పెసర కిలో రూ.134 ఖరీదు కాగా, సబ్సిడీ మినహా రూ.67లకు లభిస్తాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వేసవి దుక్కులు చేసి, పచ్చిరొట్ట పైరు వేసి, పూత దశలో భూమిలో కలియదున్ని దమ్ము చేస్తే, వరి పంటకు యూరియా వాడకాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు. తద్వారా వరిలో చీడపీడలు సోక కుండా పంటను కాపాడుకొని మెరుగైన, నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని తెలిపారు.

రాయల్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మరిన్ని సేవలు : డాక్టర్ లక్ష్మణ్

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలో ఆనందపురం జంక్షన్ బంటుపల్లి వారి కల్లాలు రోడ్డులో డాక్టర్ లక్ష్మణ్ రాయల్ సూపర్ స్పెషాలిటీ పోలిక్లినిక్‌లో మరిన్ని సేవలు అందిస్తున్నామని డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. ఆదివారం నుంచి ఈసీజీ, ఎక్స్‌రేతో పాటు నూతనంగా పలు వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. వెల్లంకిలో నూతన బ్రాంచిని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యసేవలందించడమే తమ హాస్పిటల్ ముఖ్య ఉద్దేశం అని చెప్పారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుటుంబానికి హెల్త్ కార్డు అందిస్తామన్నారు. ఆ కార్డుతో ఉచిత ఎంట్రీతో కుటుంబంలోని ఎవరైనా వైద్యం చేయించుకోవచ్చని తెలిపారు.

నేడు కుంతీమాధవస్వామి చందనోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పద్మనాభం గ్రామంలో ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయంలో మాధవ స్వామి విగ్రహానికి ఆదివారం చందనోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి భక్తులు సహకరించాలని ఆలయ కమిటీ కోరింది. ఈ కార్యక్రమానికి భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు హాజరుకానున్నారు.

వివాహ వేడుకలకు ప్లాటినం ఆభరణాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వివాహ వేడుకల సీజన్ సందర్భంగా వివిధ రకాలైన ప్లాటినం ఆభరణాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పల్లవి శర్మ చెప్పారు. శనివారం ఉదయం బీచ్ రోడ్‌లోని ప్రముఖ హోటల్‌లో జరిగిన ప్లాటినం ఆభరణాల ప్రదర్శనకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సాధారణ ప్లాటినం లవ్ బ్యాండ్లతో పాటు వివాహ సందర్భంగా ప్రత్యేక లవ్ బ్యాండ్లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఎంగేజ్‌మెంట్ రింగ్‌లూ అందుబాటులో ఉన్నాయన్నారు. ప్లాటినం 95 శాతం స్వచ్ఛమైనది, మన్నికైనదని తెలిపారు. దాని స్వాభావిక ప్రకాశాన్ని కోల్పోకుండా దీర్ఘకాలం నిలిచి ఉంటుందన్నారు.

ఘనంగా కృష్ణయ్య, నాగశిరోమణి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -మధురవాడ : జనసేన పార్టీ సీనియర్ నాయకుడు బివి.కృష్ణయ్య, నాగశిరోమణి దంపతుల జన్మదిన వేడుకలు మిదిలాపురి ఉడాకాలనీలో ఘనంగా జరిగాయి. పార్టీలకతీతంగా తెలుగుదేశం, వైసిపి, బిజెపి జనసేన నాయకులు వచ్చి ఆ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భీమిలి జనసేన పార్టీ ఇంచార్జ్ సందీప్ పంచకర్ల మాట్లాడుతూ, కృష్ణయ్య నాగ శిరోమణిలు జనసేన పార్టీకి ఆది దంపతులుగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పిళ్లా వెంకటరావు, పోతిన శ్రీను, వి.రవి, మొల్లి లక్ష్మణరావు, పసుపులేటి వాసు, నాగోతి నరసింహనాయుడు, పిళ్లా శ్రీను, పేకెటి శ్రీను, పోతిన తిరుమలరావు, సంతోష్ నాయుడు, నాని, వెంకటేష్, త్రినాథ్, కె.శంకర్, పి.గంగరాజు పాల్గొన్నారు.

అవంతిలో ఎపిఇఎపి సెట్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎపిఇఎపి సెట్ ఆన్‌లైన్ పరీక్షలు స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరిగింది. తొలి రోజు 175 మంది విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షకు హాజరైనట్టు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

మంగమారిపేట జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని మంగమారిపేట జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం ఎన్.మెహర (56) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈమె గతంలో తాటితూరు జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎంగా కూడా పనిచేశారు. ఈమె మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మెహర (ఫైల్ ఫొటో)

బాలల హక్కులను పరిరక్షించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ సభ్యులు

ప్రజాశక్తి - అరిలోవ : బాలల హక్కుల పరిరక్షణలో అధికారులు కీలక పాత్ర పోషించాలని ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు కోరారు. బాలల హక్కులు, వారి సంక్షేమంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, జిల్లా బాలల సంరక్షణ అధికారులతో ఆర్‌జెడి జి.చిన్మయిదేవి నేతృత్వంలో కృష్ణాపురం మహిళా ప్రాంగణంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసలి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమీక్షలో గొండు సీతారాం పాల్గొన్నారు. ముందుగా వీరు 6 జిల్లాల్లో ఇంతవరకు నమోదైన బాల్య వివాహాలు, పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల వివరాలు, గ్రామ స్థాయిలో వీటి నిర్మూలనకు ఏర్పాటుచేసిన కమిటీలు, వాటిలో ప్రజా ప్రతినిధుల పాత్ర, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చేపడుతున్న ప్రణాళికాయుత చర్యలు, కార్మిక శాఖ సమన్వయంతో ఎటువంటి చర్యలు చేపట్టారు, బాల యాచకులు నిర్మూలనకు, వారిని అదుపులోకి తీసుకున్నాక వారి విద్యాభ్యాసం, అభివృద్ధికి చేపట్టే చర్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం అనాథ, పేద పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు, వారికి చేరవేస్తున్న విధి విధానాలపై జిల్లాల వారీగా లెక్కలతో పాటు అడిగి తెలుసుకున్నారు. అధికారిక దత్తత కార్యక్రమాలపై జిల్లా బాలల సంరక్షణ అధికారుల సమన్వయంతో ఎటువంటి ప్రచార, అవగాహనా కార్యక్రమాలు చేపట్టారో నివేదికల ద్వారా సమాచారం రాబట్టారు. ఈ ఏడాది ఉచిత విద్యా నిర్బంధ హక్కు చట్టం ద్వారా ప్రభుత్వం కేటాయించిన సీట్లుపై ఆయా పాఠశాలల యాజమాన్యాలు తిరస్కరిస్తే జిల్లా విద్యా శాఖాధికారుల సమన్వయంతో చేపడుతున్న చర్యలు క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు.

చిట్టివలస జెడ్‌పి హైస్కూల్‌లో సిబిఎస్‌ఇ అమలు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి టెన్త్‌లో సిబిఎస్‌ఇ సిలబస్ అమలు చేయనున్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలో సుమారు 28 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా, వీటిలో చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో సిబిఎస్‌ఇ సిలబస్ అమలుకానుంది.

ప్రత్యేకతలు ఇవీ..

- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా 1972లో ప్రారంభమైంది. అంకిత భావం గల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఉండడంతో 2018-19 విద్యా సంవత్సరం నుంచి 2022-23 వరకు ఇదే పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందారు.
- 2022-23 విద్యా సంవత్సరంలో టెన్త్‌లో మండలంలోనే అత్యధికంగా ఇదే పాఠశాల విద్యార్థి 585 మార్కులు సాధించారు. 17 మంది విద్యార్థులకు 500కు పైగా మార్కులు వచ్చాయి.
- 2018-19 విద్యా సంవత్సరం నుంచి 2023-24 వరకు 9 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు.
- ట్రిపుల్ ఐటీ పోటీ పరీక్షలో ఇదే పాఠశాలకు చెందిన ఆర్ శ్రుతి భాను 2019లో 11వ ర్యాంకు సాధించి, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ద్వారా ప్రశంసా పత్రం అందుకున్నారు.
- ఏటా జరిగే కౌశల్ పోటీల్లో 2021 నుంచి పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలుస్తూ వస్తున్నారు.
- చదువుతో పాటు సహ పాఠ్య కార్యక్రమాలకు ప్రాధాన్యం.
- 5వేల పుస్తకాలతో గ్రంథాలయం నిర్వహణ.
- నాణ్యమైన, విశ్లేషణాత్మక బోధన
- ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ ల్యాబ్స్ ఏర్పాటు
- డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కలిగి ఉండడం
- కంప్యూటర్‌లో శిక్షణ

సిబిఎస్‌ఇ సిలబస్ అమలుకానున్న చిట్టివలస జెడ్‌పి హైస్కూల్

హెచ్‌ఒడి జిఎం దుర్గాప్రసాద్‌తో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రమాద బాధితునికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్ డిపార్టుమెంట్‌లో వివిఎస్ ఎంటర్ ప్రైజస్ కంపెనీ వద్ద స్కిల్డ్ కార్మికుడు జె సాంబయ్య నిలబడినిలబడి ఎలక్ట్రికల్ పనులు చేస్తున్న చోట ట్యాంకుపైనున్న షీట్ విరిగి పోవటంతో ట్యాంకులో ఉన్న వేడి నీటిలో పడి 80 శాతం కాలిపోవడానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఒవి.రావు అన్నారు. కార్మికునికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కోక్ ఓవెన్ హెచ్‌ఒడి ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్కిల్డ్ కార్మికులకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇఎస్‌ఐ సీలింగ్ రూ.21 వేలకు మించి పెంచకపోవడంతో వారికి వైద్య సౌకర్యం లేదన్నారు. యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. భద్రతా చర్యలు సరిగా లేకపోవడంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం హెచ్‌ఒడి జిఎం దుర్గాప్రసాద్‌ను కలిసి మాట్లాడారు. మెరుగైన వైద్యం కోసం యాజమాన్యం బాధ్యత తీసుకుంటుందని, సెవెన్ హిల్స్ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు దుర్గాప్రసాద్ చెప్పారని తెలిపారు. యాజమాన్యం హామీని నిలబెట్టుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, నాయకులు యు.సోమేష్, పి.మసేను, పైడిరాజు, అంకరెడ్డి శ్రీను, నమ్మి దేవుడు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

గణేష్‌ను పరామర్శిస్తున్న వైవి.సుబ్బారెడ్డి

గణేష్‌కు వైవి సుబ్బారెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-సీతమ్మధార : అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైసిపి సీనియర్ నేత మెరువ గణేష్‌ను వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి శనివారం పరామర్శించారు. గణేష్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులనడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు : కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని విశాఖ ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, అధికారులు తగు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల అనంతరం నియోజకవర్గం పరిధిలో కుటుంబ కలహాలతో జరిగిన ఒక గొడవను వైసిపిపై రుద్దేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. దీనిపై పోలీసు అధికారులు విచారణ జరిపి రాజకీయాలకు, గొడవకు ఎటువంటి సంబంధమూ లేదని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. అయినా ప్రతిపక్ష నాయకులు ఈ గొడవను వైసిపిపై రుద్ది పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

దోబీఖానా లేక అవస్థలు

బట్టలు ఉతుక్కునేందుకు, ఆరబెట్టేందుకు ఇబ్బందులు

ప్రజాశక్తి -తగరపువలస : దోబీఖానా లేక రజకులు అనేక అవస్థలు పడుతున్నారు. బట్టలు ఉతుక్కునేందుకు, ఆర బెట్టుకునేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జివిఎంసి ఒకటో వార్డు పరిధిలో తగరపువలస, కొత్తపేట ప్రాంతాల్లో సుమారు 50 కుటుంబాలు రజక వృత్తిపై ఆధారపడి ఉన్నాయి. స్థానిక గోస్తనీ వద్దకు వెళ్లి బట్టలు ఉతికి అక్కడనే ఆర బెడుతుంటారు. హైవే ఆవల వెంకటేశ్వరమెట్ట వెనుక ఉన్న ప్రాంతాల ప్రజల వాడుక, వర్షపు నీరు మళ్లించేందుకుగాను జివిఎంసి ఆధ్వర్యాన ఇటీవల కాల్వ తవ్వారు. శాస్త్రీయ పద్ధతిలో కాల్వ తవ్వక పోవడం వల్ల నీరు నిల్వ ఉంటుందని, దీంతో మురుగు నీరు గోస్తనీలోకి వస్తుండడంతో ఆ నీటిలో బట్టలు ఉతకడం ఇబ్బందిగా ఉంటుందని పలువురు రజకులు వాపోతున్నారు. మరో వైపు ఉతికిన బట్టలు ఆర బెట్టుకునేందుకు సరిపడా స్థలం కూడా లేని పరిస్థితి ఉందని అంటున్నారు. వేసవిలో నదిలో సరిపడా నీరు లేని సందర్భాల్లో బట్టలు ఉతుక్కునేందుకు అనేక ఇబ్బందులు పడే వాళ్లమని, ప్రస్తుతం కూడా అవే ఇబ్బందులని రజకులు వాపోయారు. రజకుల విజ్ఞప్తి మేరకు 30 కుంచీలతో 2004-05 మధ్య కాలంలో గోస్తనీ వంతెన సమీపంలో దోబీఖానా నిర్మాణం జరిగింది. ఆర్‌టిసి బస్సు డిపో, కాంప్లెక్స్ నిర్మాణం కోసం దోబీఖానాను 2016లో సంబంధిత అధికారులు కూల్చేశారు. నాటి నుంచి నేటి వరకూ దోబీఖానా నిర్మాణం జరగనే లేదు. పక్కనే ఉన్న 40 సెంట్ల ప్రభుత్వ స్థలంలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించి దోబీఖానా నిర్మించాలని స్థానిక రజకులు కోరుతున్నారు. ఈ మేరకు ఎన్ని దఫాలుగా వినతులు, విజ్ఞప్తులు చేసినా సరే ప్రజా ప్రతినిధులు గానీ, అధికారులు గానీ ఇప్పటికీ స్పందించలేదని వారు అంటున్నారు.

దోబీఖానా ప్రతిపాదిత స్థలం

దోబీఖానా నిర్మించాలి

గోస్తనీ సమీపంలో దోబీఖానా నిర్మాణం చేపట్టాలి. దోబీఖానా లేనందున బట్టలు ఉతుక్కునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం.

కళింగపట్నం కొండబాబు
రజక సంఘం ప్రతినిధి

వృత్తే ఆధారం..

ఎంతో కాలంగా రాజక వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. వేరే వృత్తి చేత కాదు. ప్రభుత్వం రజకులను ఆదుకోవాలి.

కళింగపట్నం రామారావు
రజక సంఘం ప్రతినిధి

పరిపాలనా విభాగాల పరిశీలన

విభాగాల్లో సూచనలిస్తున్న ఎయు రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలో పలు విభాగాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ శనివారం పరిశీలించారు. పరిపాలనా విభాగంలో సేవలందిస్తున్న ప్రతి విభాగాన్నీ ప్రత్యక్షంగా పరిశీలించి, సంబంధిత సిబ్బందితో మాట్లాడారు. కార్యాలయాలు ఆధునీకరణ, అవసరమైన మార్పులు, మరమ్మత్తులు చేపట్టడం తదితర అంశాలపై సిబ్బంది సూచనలు, ఆలోచనలు తీసుకున్నారు. ప్రతి విభాగాన్నీ పూర్తిస్థాయిలో ఆధునీకరించడం, విద్యార్థులకు, ఉద్యోగులకు మరింత సమర్ధ సేవలు అందించడం లక్ష్యంగా ఆలోచన చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ వెంట డి.ఆర్ సాంబమూర్తి, ఎఆర్ గంట గోపాలకృష్ణ, పలువురు సూపరింటెండెంట్‌లు ఉన్నారు.

ఎన్‌సిసి క్యాడెట్స్‌కు అభినందనలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సిసి క్యాడెట్స్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల అభినందించారు. కళాశాల ఎన్‌సిసి క్యాడెట్స్ సిహెచ్ సాహితి ఫణి (బిఎస్‌సి 3వ సంవత్సరం), ఎన్.కిరణ్మయి (బిఎస్‌సి ద్వితీయ సంవత్సరం) పెద్దాపురంలో ఈ నెల 3 నుంచి 14వ తేదీ వరకు జరిగిన ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ క్యాంప్‌లో పాల్గొని ఫైరింగ్‌లో మెళకువలు నేర్చుకోవడాన్ని ప్రిన్సిపల్ అభినందించారు. కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్ కె.గీతాంజలి, పీడీ డాక్టర్ ఆర్.కిరణ్మయి పాల్గొన్నారు.

రాజశేఖర్ సేవలు మరువలేనివి

రాజశేఖర్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రరాయ్, చీమలపాటి రవి, కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : హైకోర్టు రిజిస్ట్రార్‌గా సేవలందించిన బి.రాజశేఖర్ సేవలు మరువలేనివని గుజరాత్ హైకోర్టు జడ్జి జస్టిస్ చీకటి మానవేంద్రరాయ్ పేర్కొన్నారు. హైకోర్టు రిజిస్ట్రార్‌గా సేవలందిస్తూ కోవిడ్ సమయములో గుండెపోటుతో మరణించిన బి.రాజశేఖర్ ఫొటో ఆవిష్కరణను కుటుంబ సభ్యుల ఆధ్వర్యాన దసపల్లా హోటల్‌లో శనివారం ఏర్పాటుచేశారు. ఈ మానవేంద్రరాయ్ ముఖ్యఅతిథిగా హాజరై రాజశేఖర్ ఫొటోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ మానవేంద్రరాయ్ మాట్లాడుతూ, 1995లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన రాజశేఖర్ అంచలంచెలుగా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ స్థాయికి ఎదిగారన్నారు. రాజశేఖర్ న్యాయవాదిగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అనేక కేసులు వాదించారని, న్యాయమూర్తిగానూ విధి నిర్వహణలో తనదైన శైలితో అనేక తీర్పులు వెల్లడించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సాంకేతిక సమాచార రిజిస్ట్రార్‌గా సుప్రీంకోర్టు ఇచ్చిన సూత్రాలకు అనుగుణంగా హైకోర్టు, జిల్లా స్థాయిలోని కోర్టులను సాంకేతికంగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. కింది కోర్టులలో సాంకేతికతను అతివేగంగా విస్తరింపజేశారని తెలిపారు. విశిష్ట అతిథి ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ చీమలపాటి రవి మాట్లాడుతూ, విశాఖపట్నం న్యాయవాదుల సంఘం ప్రతిష్ఠను రాజశేఖర్ ఇనుమడింపజేశారన్నారు. విశిష్ట అతిథి, విశ్రాంతి న్యాయమూర్తి డివిఎస్ఎస్ సోమయాజులు, ఏపీ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్.కృష్ణమోహన్, ఆంధ్ర యూనివర్సిటీ న్యాయ కళాశాల మాజీ ప్రొఫెసర్ కేశవరావు, సత్యనారాయణ తదితరులు రాజశేఖర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ దంతా నరేష్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు టివిఎస్ కెకె కనకరాజు, కుప్పిలి మురళీధర్, బగాది తులసీదాస్, పూర్వ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు రవీంద్రప్రసాద్, బండారు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించరాదు

పరవాడ డిఎస్‌పి కెవి సత్యనారాయణ

ప్రజాశక్తి అచ్యుతాపురం

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాలలో ఎటువంటి గ్రామ సభలు, సమావేశాలు నిర్వహించరాదని పరవాడ డిఎస్‌పి కెవి సత్యనారాయణ అన్నారు. అచ్చుతాపురం సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను శనివారం రాత్రి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మండలంలో ఎన్నికల వాతావరణం తదనంతర పరిణామాలపై మాట్లాడారు. ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి ప్రజలు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించారని చెప్పారు. ఎన్నికల ఫలితాలు వెలువడినంతవరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. అంతవరకు ఎవరు ఇటువంటి ఆవేశాలతో ఘర్షణలకు దిగరాదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాలలో సంచరించినా, లాడ్జిల్లో బయట వ్యక్తులు వచ్చి ఉన్నా తెలియజేయాలని కోరారు. పెట్రోల్ బంకులలో లూజుగా బాటిళ్లలోనూ, క్యాన్‌ల్లోనూ పెట్రోలు విక్రయించరాదని, దీనిపై బంకు యజమానులకు ముందుగా తెలియజేశామని చెప్పారు. గ్రామ దేవతల పండగలు సజావుగా చేసుకోవచ్చన్నారు. అల్లర్లకు పాల్పడే వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అశ్లీల డ్యాన్సులు చిత్రాలు ప్రదర్శనలు చేయరాదన్నారు. బెట్టింగులకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం సాయంత్రం దిబ్బ పాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్తులను వివిధ రాజకీయ పార్టీల నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. ఆవేశాలకు కక్షలో కార్యకర్తలకు ఎవరో పాల్పడరాదని హెచ్చరించారు. అటువంటి వారిపై ముందస్తుగా కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం బుచ్చిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి సత్యనారాయణ

ప్రజలతో మాట్లాడుతున్న యలమంచిలి సిఐ గఫూర్

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-మునగపాక

ఎన్నికల పూర్తయిన నేపథ్యంలో గ్రామాల్లో ఘర్షణలు, అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎలమంచిలి సిఐ గఫూర్ హెచ్చరించారు. మండలంలోని ఉమ్మలాడ గ్రామంలో శనివారం గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో పోలీసు వారికి సహకరించినందుకు ముందుగా ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామంలో ప్రజలందరూ సోదర భావంతో ఉండాలని సూచించారు. ఎలక్షన్ కౌంటింగ్ అనంతరం కూడా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా ఉండాలని సూచించారు. ప్రస్తుతం 144 సెక్షన్ ఇంకా అమలులో ఉందని, దీనిని ప్రజలు గుర్తించాలని చెప్పారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించొద్దు

కశింకోట : ఎన్నికల కోడ్ అమలులో ఉందని, దానిని ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కశింకోట సిఐ వినోద్ బాబు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో జరుగు పండగల్లో ఎటువంటి ప్రోగ్రామ్‌లకు అనుమతి లేదని తెలిపారు. ఎక్కువ మంది గుమిగూడి ఉండడం చేయరాదని, సభలు, సమావేశాలు ఉంటే ఎన్నికల అధికారి అనుమతి తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 134, 34 కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : పాడేరు పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఎం.రామలింగంకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్స్ రూ.3,86,240 చెక్‌ను ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ చేతుల మీదుగా శనివారం అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఏఎస్ఆర్ జిల్లా, పాడేరు పోలీస్ స్టేషన్ హోంగార్డుగా ప్రశంసాపూర్వకమైన విధులు నిర్వహిస్తూ, పోలీసు శాఖకు మెరుగైన సేవలు అందించాడని ఎం.రామలింగాన్ని అభినందించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులు ఎవరైనా విధి నిర్వహణలో మరణించిన, ఉద్యోగ విరమణ పొందిన వారికి ఆర్థికంగా ఆదుకునేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలలో పనిచేస్తున్న హోంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను ఆర్థిక సహాయంగా అందజేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, ఏఓ బి.శారద, కార్యాలయ సిబ్బంది వరలక్ష్మి, రాజేష్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలకు రవి కాన్వెంట్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేటలోని రవి కాన్వెంట్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఏపీ గురుకుల పాఠశాలలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కె.సూర్యనారాయణ శనివారం తెలిపారు. ఏపీ గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 25న అనకాపల్లిలో నిర్వహించారు. బుచ్చయ్యపేట రవి కాన్వెంట్ విద్యార్థులు ఆ పరీక్షల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ స్కూల్లో నాలుగో తరగతి చదువుతున్న ఎన్.స్వాతి, ఎన్.అక్షర, ఎన్.దీక్షిత భీమునిపట్నం గురుకుల పాఠశాలకు, ఎస్.సాగరిక యలమంచిలి గురుకుల పాఠశాలకు, ఎన్.నంద వర్ధన్, ఎస్.హర్ష నర్సీపట్నం గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు సీట్లు సాధించడం పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఎన్.అక్షర, ఎన్.దీక్షిత, ఎస్.హర్ష

ఎస్.సాగరిక, ఎన్.స్వాతి, ఎన్.నందవర్ధన్

గురువులను గౌరవించాలి

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని, గురువులను గౌరవించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని సామాజికవేత్త ఆకుల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక రవి కాన్వెంట్ నుండి ఆరుగురు విద్యార్థులు ఏపి గురుకుల పాఠశాలలకు ఎంపిక కావడం పట్ల ఆ పాఠశాల కరెస్పాండెంట్ కె.సూర్యనారాయణ దంపతులను నాగేశ్వరరావు ఆధ్వర్యాన శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు శాలువా కప్పి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులకు విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేందుకు గత 30 ఏళ్లగా కృషి చేస్తున్న ఉపాధ్యాయ దంపతులను సత్కరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సీతా వరలక్ష్మి సన్యాసినాయుడు, శనివాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ, పులిహోర పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం

ఆర్యవైశ్య యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా మండల కేంద్రంలో శనివారంమజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. పాదచారులకు, వాహనదారులకు పులిహోర, మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి పూజలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని పలు ఆలయాల్లో శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉమామహేశ్వరి దేవి ఆలయంలో మహిళలు అమ్మవారికి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలోచింపజేస్తున్న నాటికలు

ప్రజాశక్తి- అనకాపల్లి

డైమండ్ హిట్స్ అధినేత మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సౌజన్యంతో, జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక గవరపాలెం రైతు భారతి ఓపెన్ ఎయిర్ థియేటర్లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్నాయి. రెండవ రోజైన శనివారం విజయవాడ మైత్రి కళా నిలయం వారి 'బంధం', నెల్లూరు ప్రియదర్శని వారి 'నాన్న బంగారు' నాటికలను ప్రదర్శించారు. మొదటి నాటిక బంధం మాడుగుల రామకృష్ణ రచించగా టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించారు. కథ సారాంశం పరిశీలించగా... ప్రతి మనిషి జీవితం తల్లి తండ్రి తోబుట్టువులు, బంధు జనాలతో ప్రారంభమవుతుంది. ఎన్ని బంధాలు ఉన్నా కన్న బిడ్డలు రెక్కలొచ్చి ఎగిరిపోగా వృద్ధాప్యంలో కడవరకు మిగిలేది భార్య భర్తలు. ఇది వారికి రెండో బాల్యంగా మారుతుంది. ఆ సమయంలో దంపతుల మధ్య కీచులాటలు తగవులు తాత్కాలికంగా మారుతాయి. ఇటువంటి దంపతులే సుబ్బారాయుడు, లలితాంబ. అయితే వృద్ధాప్యంలో సుబ్బారాయుడుకు కొత్తదనాన్ని కోరుకుంటూ వెర్రి ఆలోచనలు పుడతాయి. దీంతో భార్యను దూరం పెడతాడు. స్నేహితుడు నారాయణ ఎంత చెప్పినా పట్టించుకోడు. కొత్త గేమ్ మొదలు పెట్టానని అనుకుంటే భగవంతుడు మరో విధంగా గేమాడి అతని ఆలోచనలు తలకిందులు చేయగా తట్టుకోలేని సుబ్బారాయుడు విలపిస్తాడు. ఊహించని మలుపుతో తన కళ్ళు తరచుకొని మామూలుగా మారేదే బంధం ఇతివృత్తం.

ఇక రెండో నాటిక నాన్న బంగారుకు రచన, దర్శకత్వం జిబికె మూర్తి వహించారు. ఇతి వృత్తం... ఎదురుగా వున్న బిడ్డను ముద్దు పెట్టుకున్నప్పుడు కలిగే అనుభూతి, ఆ బిడ్డ ఫోటోను ముద్దు పెట్టుకున్నప్పుడు కలుగదు. ఎందుకంటే మొదటి దానిలో జీవం ఉంటే, రెండవ దానిలో దాని ప్రతిబింబం మాత్రమే ఉంటుంది. అలాగే, వీడియో కాల్‌లో మనిషికి, మనిషికి మధ్య స్క్రీన్ అడ్డం ఉంటుంది. అయితే ఇల్లు స్వీట్ హోమ్ కావాలంటే, కుటుంబ సభ్యులందరు ఫిజికల్‌గా దగ్గరగా ఉండాలి, టచ్ ఉండాలి, స్వచ్ఛమైన ప్రేమ, అభిమానాలు ఉండాలి. అదీ సంపద. ఆ సంపదను ఇప్పుడు కొందరు తండ్రులు, బిడ్డలకు 60 ఏళ్ళు వచ్చినా వాడికేం తెలీదు, పసివాడు అన్న మాయలో వాడి జీవితాన్ని ఉద్ధరిస్తున్నాం అనుకుంటారే కానీ, బిడ్డ మనసును గాయ పరుస్తున్నామని గ్రహించరు. తామెక్కడికూ వెళ్ళం, మీ దగ్గరే ఉంటామని కొడుకులు ప్రాధేయ పడుతూ వున్నా, పక్కింటి సుబ్బారావు కొడుకు అమెరికా, ఎదురింటి పంకజం అల్లుడు ఆస్ట్రేలియాలో ఉద్యోగాలు చేస్తుంటే నువ్వు ఇక్కడ ఉంటే, మా తల కొట్టేసినట్టుగా ఉంటుంది, నువు వెళ్ళితీరాలి అని కొడుకుల్ని బలవంతంగా దూరం చేసుకుంటున్నారు. కానీ జీవితం చాలా చిన్నది, అందులో ప్రతి క్షణాన్ని అనుభవించాలి, ఆస్వాదించాలి. గడిచి పోయిన క్షణం తిరిగి రాదు. మిస్ అయింది మళ్ళీ దొరకదు. ఆఖరి దశలో మనిషికి ఓదార్పు, ఊరట ఇచ్చేది కన్నబిడ్డల సాన్నిహిత్యం, ఆత్మీయ స్పర్శ, అందులో వుండే భరోసా, ఆనందం, అమెరికా డాలర్లో లేదు అని చేతులు కాలాక గ్రహిస్తారు. మనిషికి కావలసిన సంపద ఏమిటనేది తెలియజేసేదే నాన్న బంగారు నాటిక. ఈ రెండు నాటికలు ప్రదర్శన ప్రేక్షకుల ఆలోచనలను పునరాలోచింపజేసేవిగా ఉన్నాయి.

బంధం నాటికలో ఓ సన్నివేశం

ఘనంగా బాబర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.బాబర్ పుట్టిన రోజు వేడుకలు స్థానిక టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ముందుగా బాబర్‌కు నాగ జగదీష్ శాలువా వేసి సన్మానించారు. టిడిపి అనకాపల్లి పట్టణ అధ్యక్షులు కేకేవి డాక్టర్ నారాయణరావు, నూకాంబిక అమ్మవారు ఫొటో ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, బుద్ధ కాశీ, బోడి వెంకట్రావు, మళ్ల గణేష్, విల్లూరు రమణబాబు, జంపా మల్లికార్జునరావు, కర్రి మల్లేశ్వరరావు, దూలం ప్రసాద్, సారుపిల్లి శ్రీనివాసరావు, మేడిశెట్టి నాగరాజు, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, సిద్దిరెడ్డి ప్రసాద్, కలగా సత్యనారాయణ బ్రహ్మం, కరణం అప్పారావు, విల్లూరు సత్తిబాబు, పాల్గొన్నారు.

బాబర్‌ను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డిఇఒ వెంకటలక్ష్మమ్మ

ఉపాధ్యాయులకు సిబిఎస్ఇ విద్యా బోధనపై శిక్షణ

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని తేగాడ మోడల్ స్కూల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సిబిఎస్ఇ బోధన, విద్య విధానంపై శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ సహాయ సంచలకులు విజయ్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ, ఉప విద్య శాఖాధికారి అప్పారావు, రాష్ట్ర పరిశీలకులు శ్రీలత, మండల విద్యాశాఖ అధికారులు చిట్టిబాబు, సూర్యనారాయణ మూర్తి, ప్రిన్సిపాల్ మార్త తిలకం, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

వలస పోతున్న కూలీలు

ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యకాస డిమాండ్

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలో అనేక గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించకపోవడంతో కూలీలు ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి ప్రసాద్, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అక్కడక్కడ వర్షాలు పడుతుండటంతో చాలా గ్రామాల్లో ఉపాధి పనులు నిలిపివేశారని తెలిపారు. మండలంలోని మేడిచర్ల గ్రామంలో కొందరికే ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నారని, అందరికీ పని కల్పించాలని కోరారు. ఎ.భీమవరం గ్రామంలో పనులు లేకపోవడంతో 250 కుటుంబాలు వేరే ప్రాంతాలకు వలస పోతున్నారని చెప్పారు. ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ అన్ని గ్రామాల్లో పర్యటించి కూలీలు వలసలు పోకుండా ఇక్కడే పనులు కల్పించాలని ప్రసాద్, దేముడు డిమాండ్ చేశారు.

వైసిపి గెలుపు ఖాయం

ప్రజాశక్తి-కొయ్యూరు : పాడేరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాజు విశ్వేశ్వరరాజు, అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనుజా రాణి గెలుపు ఖాయమని, ప్రతిపక్షాలకు దిమ్మతిరిగేలా అత్యధిక మెజార్టీతో గెలుస్తామని ఎంపిపి బడుగు రమేష్, జెడ్పిటిసి వారా నూకరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శనివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే వైసిపి అభ్యర్థులను గెలిపిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి- కశింకోట

కసింకోట పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు శనివారం మండలంలోని కశింకోట, తాళ్ళపాలెం, పరవాడపాలెం, కన్నూరుపాలెం, జోగారావుపేట తదితర గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వినోద్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల తరువాత గ్రామాల్లో స్వేచ్ఛాయత వాతావరణం ఉండాలన్నారు. కౌంటింగ్ జరిగే వరకు ఘర్షణలు లేకుండా ఉండాలని సూచించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో ఎస్ఐ రమేష్ బాబు, పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా క్వారీ గోతులు

- భయభ్రాంతులకు గురవుతున్న వాహనచోదకులు

- ఎత్తైన రక్షణ గోడ నిర్మించాలని వేడుకోలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని కె.కోటపాడు నుండి దాలివలస, పిండ్రంగి మీదుగా లంకవానిపాలెం వెళ్ళే పంచాయతీ రాజ్ రహదారిలో పిండ్రంగి - లంకవానిపాలెం మధ్య రోడ్డుకు ఇరువైపులా నల్వరాయి క్వారీ గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు పక్కనే సుమారు 50 అడుగుల లోతులో ఉన్న ఈ క్వారీ గోతులకు ఎత్తైన రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని వాహనచోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

పిండ్రంగి దాటిన తరువాత లంకవానిపాలెం గ్రామానికి దగ్గరిలో రోడ్డు పక్కన నల్లరాయి కోసం సుమారు 20 సంవత్సరాల క్రితం క్వారీ తవ్వకాలు చేశారు. రోడ్డుకు ఇరువైపులా సుమారు 50 అడుగుల లోతు వరకు పెద్ద వెడల్పులో నల్లరాయి తవ్వకాలు చేపట్టారు. రోడ్డుకు ఆనుకొని ఇరువైపులా క్వారీ గోతులు ఉండటం, ఈ క్వారీ గోతుల వద్దే రోడ్డు మలుపు ఉండడంతో ఈ ప్రాంతం ప్రమాదకరంగా ఉంది. లోతుగా ఉన్న ఈ క్వారీ గోతులను రోడ్డు మీద ఉండి చూస్తే ఎవరైనా భయపడాల్సిందే. అంత ప్రమాదకరంగా కనిపిస్తాయి. గతంలో ఈ క్వారీ గోతులో పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటన కూడా ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం లారీ కూడా ప్రమాదవశాత్తు ఈ క్వారీ గోతులో పడింది.

మలుపు వద్ద రోడ్డుకు ఆనుకొని ఉన్న నల్లరాయి క్వారీ గోతు

దీంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

పెరిగిన వాహనాల రాకపోకలు

కె.కోటపాడు, దాని పరిసర గ్రామాలవారు, దాలివలస, పిండ్రింగి, మర్రివలస తదితర గ్రామాలవారు లంకవానిపాలేనికి ఆనుకొని ఉన్న ఎల్.కోట, కొత్తవలస మండలాల్లోని పలు గ్రామాలకు ద్విచక్ర వాహనాలు, ఆటోలపై ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తూ ఉంటారు. మండలంలోని కె.సంతపాలెం వద్ద ఉన్న రైతు బజారుకు ఈ మార్గంలోనే రైతులు వేకువజామునే ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో కూరగాయాలు తెస్తూ ఉంటారు. లంకవానిపాలెంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆ పరిసర ప్రాంత ప్రజలు వైద్యం నిమిత్తం రాత్రి, పగలు వస్తూ ఉంటారు. మండల కేంద్రం కె.కోటపాడుకు పలు గ్రామాల ప్రజలు ఈ మార్గంలో వస్తూ పోతూ ఉంటారు. దీంతో ఈ రోడ్డు గుండా వాహనాల రాకపోకల సంఖ్య పెరగడంతో ఈ క్వారీల వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని అందరూ భయపడుతున్నారు.

ఈ క్వారీ లంకవానిపాలెం, పిండ్రంగి గ్రామాలకు చెందిన పొలాల మధ్యలో ఉంది. పొలంలోకి పశువులను మేతకు తోలుకొస్తూ ఉంటారు. అలాగే ఈ దగ్గరిలోనే పశువుల కల్లాలు కూడా ఉన్నాయి. లోతుగా ఉన్న ఈ క్వారీ గోతులు పక్కన పశువులు మేత మేసేటప్పుడు అందులో పడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మనుషులకు, పశువులకు ప్రమాదకరంగా ఉన్నా ఈ క్వారీ గోతులపై ఇప్పటి వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఈ క్వారీ గోతుల వద్ద ఎత్తైన రక్షణ గోడలు నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వివాహిత ఆత్మహత్య

మరిది, తోడుకోడలు, ఆడపడుచుల వేధింపులే కారణమని బాధితురాలి తండ్రి ఫిర్యాదు

భర్త రేణుకృష్ణతో మృతురాలు శ్రావణి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం, ఎల్‌బిపి.అగ్రహారం గ్రామంలో ఓ వివాహిత గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఆమె మరిది, తోడుకోడలు, ఆడపడుచుల వేధింపులు తాళలేక తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుచ్చయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం... ఎల్‌బిపి.అగ్రహారం గ్రామానికి చెందిన తమరాన రేణుకృష్ణ, శ్రావణి (28) దంపతులకు ఒక కుమారుడు ఉన్నారు. భర్త రేణుకృష్ణ ఢిల్లీలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆయన తల్లి అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ నేపథ్యంలో రేణుకృష్ణ, ఆయన తమ్ముడు కుటుంబాలు తమ తల్లిదండ్రులను ఒక నెల ఒకరు, ఒక నెల ఒకరు గ్రామానికి వచ్చి చూసుకోవడం జరుగుతుంది. ఇందులో భాగంగా ఈ నెలలో రేణుకృష్ణ భార్య శ్రావణి అత్త మామలను చూసుకోవడానికి గ్రామంలోని అత్తవారి ఇంటిలో ఉంటుంది. శ్రావణి శుక్రవారం రాత్రి మేడపైన ఉన్న గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శనివారం ఉదయం శ్రావణి మామ మేడపైకి వెళ్లగా, శ్రావణి ఫ్యాన్‌కు వేలాడుతున్న దృశ్యాన్ని చూసి అందరికీ తెలియజేశారు. దీనిపై సమాచారం అందుకున్న బుచ్చయ్యపేట ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి పంచనామా నిమిత్తం తరలించారు. శ్రావణి మరిది, తోడుకోడలు, ఆడపడుచు వేధింపుల వల్లే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని శ్రావణి తండ్రి కిల్లి నాయుడు బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్తని సరిగా చూసుకోవడం లేదని ఆరోపిస్తూ ఆడపడుచులు, మరిది తోడుకోడలు వేధింపులకు గురిచేస్తూ, దుర్భాషలాడుతూ హింసించడం జరిగిందని, ఆ బాధలను భరించలేక మానసికంగా కృంగి ఉండేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఈ మేరకు మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు

అఖండ మెజార్టీతో గెలుస్తాం : పంచకర్ల

ప్రజాశక్తి-పరవాడ

ఇటీవల జరిగిన ఎన్నికల్లో పెందుర్తి నుండి ఆఖండ మెజార్టీతో గెలుస్తామని పెందుర్తి నియోజకవర్గం టిడిపి, బిజెపి, జనసేన కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మండల కేంద్రం పరవాడ మరిడిమాంబ కళ్యాణ మండపంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో శనివారం పంచకర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరిగిన ఎన్నికలలో పరవాడ మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు చాలా బ్రహ్మాండంగా కష్టపడ్డారని, మీ కష్టాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని చెప్పారు. ఎలక్షన్ ప్రచార సమయంలో ఏదైతే హామీలు ఇచ్చామో వాటిని చిత్తశుద్ధితో నెరవేరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గండి వంశీ, పైల జగన్నాధరావు, మాసవరపు అప్పలనాయుడు, మోటూరు సన్యాసినాయుడు, దుల్ల రాము నాయుడు, కన్నూరు వెంకటరమణ, పాల అచ్చలనాయుడు, వియ్యపు చిన్న, బొద్దపు శ్రీనివాస్, బుగిడి రామ గోవిందరావు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, బంగారు రాజు, పిల్లా శివకృష్ణ, మచ్చ శివ,కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి దౌర్జన్యాలను అరికట్టడంలో పోలీస్ శాఖ విఫలం

ప్రజాశకి-అనకాపల్లి : వైసిపి దౌర్జన్యాలను అరికట్టడంలో పోలీసు శాఖ విఫలమైందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు మండిపడ్డారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధి జీవీఎంసీ 49వ వార్డులో బర్మా క్యాంప్ కాలనీలో సుంకర ధనలక్ష్మి, ఆమె కుమార్తెలు నూకరత్నం, రమ్య, కుమారుడు నాటి చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన ఇంట్లో నివాసముంటున్నారని తెలిపారు. ఎన్నికల ముందు రోజు వైసిపి నాయకులు వీరి ఇంటికి వచ్చి ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని ఒత్తిడి చేశారని, ధనలక్ష్మి దానికి నిరాకరించిందని తాము టిడిపికే ఓటు వేస్తామని వాళ్ళు తేల్చి చెప్పారని పేర్కొన్నారు. దీంతో వైసిపి మూకలు వారిపై దాడి చేశారన్నారు. ఓటమి భయంతో వైసిపి గుండాలు ఈ విధంగా తెలుగుదేశం వారిపై మూకుమ్మడి దాడులు చేయడం దారుణమన్నారు. ప్రశాంతమైన విశాఖ నగరంలో జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికైనా మేల్కొని రౌడీ మూకలపై ముందస్తు బైండోవర్ చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు ఎస్కే బాబర్, బుద్ధ కాశి, కాండ్రేగుల సత్యనారాయణ, సిద్దిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం కలేనా...

- పిల్లర్ దశలోనే నిలిచిన పనులు - నదిని దాటి వెళ్లేందుకు అవస్థలు పడుతున్న పాదచారులు

ప్రజాశక్తి కోటవురట్ల:మండలంలో పందూరు బ్రిడ్జి పనులు ఎక్కడి కక్కడే నిలిచి పోయాయి. దీంతో ఈ మార్గంలో వెళ్లే విద్యార్థులు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పందూరు నుంచి వివిధ ప్రాంతాలకు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నది దాటి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన


నీటిలో నడిచి వెళుతున్న పిల్లలు

అసంపూర్తిగా నిలిచిన వంతెన పనులు

చెందుతున్నారు.

గతంలో 6 కోట్ల తో నిర్మాణ పనులు మొదలుపెట్టారు. అది ప్రస్తుతం పిల్లర్ల స్థాయిలోనే అసంపూర్తిగా నిలిచి పోయింది. ఈ నదిలో నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రమాదపుటంచున రాకపోకలు సాగిస్తున్నారు. ఏ క్షణాన నది పొంగుతుందో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. గ్రామస్తులు నిలదీస్తే నెల రోజుల్లో మంజూరు చేయిస్తానని చెప్పినా ఆ మాట అమలు కాలేదు. ప్రస్తుతం రాకపోకలు నిలిచి పోవడంతో వాహనదారులు చుట్టూ పది కిలోమీటర్లు తిరిగి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఈ విషయమై స్థానిక ఇంజనీరింగ్ అధికారిని కుమార్ రాజాను వివరణ కోరగా గత ప్రభుత్వం 6 కోట్లు ఖర్చుతో నిర్మాణం చేపట్టామని, మరో 5.60 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరు కావాల్సి ఉందని తెలిపారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

గొలుగొండలో మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్: సర్పీపట్నం శాఖ గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయాధికారిణి పి.దమయంతి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగింది. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ వ్యాయామం చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం సమ్మర్ క్యాంపులో పలువురు పాఠశాల ఉపాధ్యాయులు పేపర్ రీడింగ్‌తో కలిగే లాభాలను తెలిపారు. సైన్స్ మానవ జీవితంలో ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు.

గొలుగొండ:స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఈ శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు బుక్ రీడింగ్, నీతి కథలు చెప్పడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేశ నాయకుల జీవిత చరిత్రలను చదివి వినిపించారు. గ్రంథాలయాధికారి రాజుబాబు మాట్లాడుతూ, ఈ వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థులకు జ్ఞానాన్ని పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు.

ఆంగ్ల భాష పై పట్టు సాధించాలి

నక్కపల్లి:విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని రిసోర్స్ పర్సన్ దాడి స్వరూప్ సూచించారు. మండలంలో చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆంగ్ల భాష పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. రిసోర్స్ పర్సన్ దాడి స్వరూప్ ఆంగ్లంలో మెలకువలు, సులువుగా మాట్లాడే విధానం, అర్థాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రతిరోజు ఆంగ్ల భాష పుస్తకాలను అభ్యసించాలన్నారు.

నక్కపల్లిలో బోధిస్తున్న గ్రంథాలయాధికారి

రేషన్ బియ్యం పంపిణీ చేయాలని

లబ్ధిదారుల ఆందోళన

ప్రజాశక్తి-అరకులోయరూరల్: ఏప్రిల్, మే నెలకు సంబంధించి రేషన్ బియ్యం పంపిణీ చేయాలని మండలంలోని లోతేరు పంచాయతీ తోడుబంధ, కురిసేల గ్రామాల లబ్ధిదారులు గ్రామ సచివాలయం వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. రెండు గ్రామాలు కలిపి 70 రేషన్ కార్డుదారులు ఉన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, అలాంటిది అసలు బియ్యమే పంపిణీ చేయక పోతే తమ పరిస్థితి ఏమిటని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ నెల ఏదో ఒక్క గ్రామానికే కోత పెడుతూనే ఉన్నారని తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో సేల్స్ మెన్, డీలర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు కె.త్రినాథ్, బిమిడి అప్పలస్వామి, బాబురావు, గంగాధర్, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న లబ్ధిదారులు

పరీక్షిస్తున్న వైద్యులు

కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చీడిగుమ్మల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద హోమీ బాబా ఆసుపత్రి ఆధ్వర్యాన కేన్సర్ స్క్రీనింగ్‌ను శనివారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 36మందికి పరీక్షలు నిర్వహించగా ఏడుగురికి కేన్సర్ నిర్ధారణ కావడంతో హోమీ బాబా ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు చీడిగుమ్మల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ధనుంజయ్ తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ ధనున్ ప్రసాద్, డాక్టర్ సునీత, డాక్టర్ శ్యామ్,సూపర్ వైజర్ ప్రసాద్, సీహెచ్ఓ ప్రసాద్, సూపర్ వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

ఆలయంలో నగర సంకీర్తన

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లిలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా నగర సంకీర్తన చేశారు. అనంతరం వాసవి కళ్యాణ మండపంలో కుంకుమ పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కక్కిరాల సురేష్, కొత్త సందీప్, తాతాజీ, భగవాన్, సత్తికొండ నరసింహ మూర్తి, గుప్త, కాశీ విశ్వనాథ్, రాము, శ్రీనివాస్, భగవాన్, సత్యేంద్ర, వాసు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కూల్ కూల్‌గా మన్యం

- వర్షాలతో గిరిజనులకు ఉపశమనం

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో గత 15 రోజులుగా అడపాదడపా కురిసిన భారీ నుంచి ఓ మోస్తారు వర్షాలు ఈ మే నెలలో మన్యంలో మండు వేసవిని మరిపించాయి. రోజు విడిచి రోజు, రెండు రోజులకు ఒకసారి వానలు కురవడతో మన్యం కూల్ కూల్ గా ఉండడంతో మన్యవాసులకు ఉపశమనం కలిగించింది.

ఈ ఏడాది ఏప్రిల్ నెలలో వానలు తగ్గు ముఖం పట్టినప్పటికీ మే నెలలో ఆరంభం నుంచి ఓ మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా కేంద్రం పాడేరుతో పాటు అరకు, అనంతగిరి, జికె వీధి, జి.మాడుగుల తదితర ప్రాంతాల్లో ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. పాడేరు ఏజెన్సీలో భారీ వర్షాలు కురిసిన వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రం పాడేరులో ఆరు రోజులు కురిసిన వర్షాలకు 103.5 మిల్లీమీటర్లు, జి మాడుగుల రెండు రోజులకు 24.7 మిల్లీమీటర్లు, చింతపల్లి మండలంలో 8 రోజులకు 64.6 ఎంఎం, జికె వీధి మండలంలో 102.7 ఎంఎం, కొయ్యూరు 6 రోజులకు 69.7, డుంబ్రిగూడ ఐదు రోజులకు 29.9, పెద్దబయలులో ఆరు రోజులకు 61.3, అనంతగిరిలో ఐదు రోజులకు 52.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అల్లూరి జిల్లా లో ఈ మే నెలలో ఇప్పటి వరకు కురిసిన వానలకు యావరేజ్ గా 42.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. మన్యంలో కురుస్తున్న ఓ మోస్తారు వర్షాలు ఖరీఫ్ వ్యవసాయానికి కూడా సానుకూలమని రైతులు చెబుతున్నారు.

నేల కొరిగిన అరటి చెట్లు

పెదబయలు :మండలంలో శనివారం మధ్యాహ్నం సుమారు రెండుగంటల పాటు ఉరుముల మెరుపులతో కూడిన గాలి వాన కురిసింది. ఉదయం విపరీతమైన ఎండ వేడిమి ఉండగా మధ్యాహ్నం 12 గంటలకు ఉరుములతో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మండల కేంద్రంలో అరటి చెట్లు నేల కొరిగాయి.


నేలకొరిగిన అరటి చెట్లు

విష పురుగు కాటు వేయడంతో

ఉపాధి కూలీకి అస్వస్థత

ప్రజాశక్తి-గొలుగొండ:ఉపాధి కూలీని విష పురుగు కాటు వేయడంతో అస్వస్థతలకు గురయ్యాడు. మండలంలోని లింగంపేట పంచాయతీ రామచంద్రపురం గ్రామానికి చెందిన కోలా రాంబాబు శనివారం ఉదయం చీడికాడ సమీపంలోని కొండపోడులో ఉపాధి పనులు చేస్తున్నాడు. పని చేస్తున్న సమయంలో విష పురుగు కాటు వేసింది. దీంతో తీవ్ర నొప్పితో కృష్ణదేవిపేట పిహెచ్‌సికి వెళ్లగా అక్కడ వైద్య సేవలు పొందాడు.

గాయపడిన కూలీ

అందంగా ఉన్న మేఘాలు

నింగిలో మేఘాలు కనువిందు

ప్రజాశక్తి -నక్కపల్లి: నింగిలో మేఘాలు శనివారం కనువిందు చేశాయి. పాల మీగడలా మెరిసిపోతూ వివిధ ఆకృతిలో దర్శనమిచ్చాయి. నీలి రంగు ఆకాశం, కొండల మధ్య మేఘాలు సందడి చేశాయి. మేఘాల అందాల దృశ్యాలను చూసిన ప్రకృతి ప్రేమికులు మైమరిచి వాటి అందాలను సెల్ ఫోన్‌లో బంధించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి -అనకాపల్లిదెన్:నర్సీపట్నం మెయిన్ రోడ్ విస్తరణ పనుల్లో భాగంగా కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల్లో రెండు స్తంభాలు విరిగి పోయి అత్యంత ప్రమాదకరంగా మారాయి. అబీద్ సెంటర్ నుంచి పాల్ ఘాట్ సెంటర్ వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు మధ్యకు పగుళ్ళ రావడంతో ప్రజలు భయాందోళనకు గురవు తున్నారు. అధికారులు స్పందించి వెంటనే నూతన స్త:బాలు ఏర్పాటు చేయాలని కోరారు.

విరిగిన విద్యుత్ స్తంభం

ఘనంగా శ్రీ కన్యకా పరమేశ్వరి జయంతోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి 1032వ జయంతి మహోత్సవ వేడుకలు శనివారం ఆలయంలో ఘనంగా జరిగాయి. ఆర్య వైశ్య యువజన సంఘం, వాసవి కల్యాణ మండప సంఘం, వాసవి విజ్ఞానమండలి, ఆర్య వైశ్య సమాజం, ఆర్య వైశ్య వెల్ఫేర్ అసోసియేషన్, వాసవి క్లబ్ సంయుక్త సౌజన్యంతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు దేవాలయ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అరిశెట్టి దినకర్, గ్రంధి రామకృష్ణారావు, కోశాధికారి సుగ్గ శివకుమార్ తెలిపారు. ఆలయంలో తెల్లవారుజామున మూడు గంటలకు సుప్రభాతంతో కార్యక్రమాలు ఆరంభమయ్యాయన్నారు. అనంతరం ప్రత్యేక క్షీరాభిషేకం, ఉత్సవమూర్తికి భక్తులచే స్వయంగా క్షీరాభిషేకం, అమ్మవారి మూలవిరాట్‌కి రజిత వస్త్రాలంకరణ, 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజా కార్యక్రమం, 102 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలపాటు 108 రకాల స్వీట్స్‌తో అమ్మవారికి నివేదన అందజేశారన్నారు. మధ్యాహ్నం పేదలకు అన్న సమారాధన, దుప్పట్లు పంపిణీ నిర్వహించినట్లు కన్యకా పరమేశ్వరి జయంతి మహోత్సవ కమిటీ చైర్మన్లు బాదం దినేష్, డాక్టర్ గోగుల సువర్ణ కుమార్ తెలిపారు.

నిధులు మంజూరైనా..

ముందుకు సాగని పనులు

◆ పూర్తి కాని తాగునీటి వాటర్ ట్యాంకులు

◆ ఇదీ జల జీవన్ మిషన్ పథకం పనుల దుస్థితి

ప్రజాశక్తి-రోలుగుంట: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ ఇంటికి సురక్షిత నీటిని కుళాయి ద్వారా అందిజేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్ పథకం ద్వారా నిధులు మంజూరు చేసింది. దీంట్లో భాగంగా మండలానికి రెండు విడతలుగా నిధులు మంజూరయ్యాయి. మండలంలో 24 పంచాయతీలు కాగా 22 పంచాయతీ గ్రామాలకు మొదటి విడత 11 కోట్ల రూపాయలు, రెండవ విడత 15 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కుళాయిలు ఏర్పాటు చేశారు.వాటర్ ట్యాంకులు మాత్రం నిర్మాణ దశలోనే ఉన్నాయని ఈ పథకం మండలంలో పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మొదట విడతగా మండలంలో వి.శరభవరం, బిబి.పట్నం, జానకిరాంపురం, గుండుబాడు పంచాయతీ శివారు కశిరెడ్డిపాలెం, రొంగలిపాలెం గ్రామాల్లో ఒక్కొక్క వాటర్ ట్యాంకుకు రూ.52లక్షలు మంజూరయ్యాయి. నిర్మాణం మాత్రం మధ్యలోనే నిలిచిపోయింది. నిర్మాణ దశలో ఏర్పాటు చేసిన డకింగ్ కర్రలు విప్పలేదు. కొవ్వూరు గ్రామంలో పునాది దశలోనే ఉంది. కొన్ని గ్రామాల్లో పాత ట్యాంకుల ద్వారానే తాగునీరు సరఫరా అవుతుంది. గతం కంటే ప్రతీ గ్రామంలోను జనాభా పెరిగింది. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా కొత్త ట్యాంక్‌లకు నిధులు మంజూరైనా నిర్మాణ పనులు ముదుకు సాగలేదు. అధికారులు స్పందించి తాగు నీటి ట్యాంకులు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జానకిరాంపురంలో అసంపూర్తిగా ఉన్న వాటర్ ట్యాంక్

ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రధాన రహదారిలో స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా మారాయి. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇటీవల ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు సక్రమంగా కనిపించక పోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాస్తవానికి ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్ల నిర్మాణానికి జిల్లా స్థాయి అధికారుల నుంచి అనుమతి తీసుకోవలసి ఉంటుంది. ఎటువంటి అనుమతులు లేకుండా వాటిని ఏర్పాటు చేశారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసిన ప్రదేశంలో వర్షపునీరు నిల్వ ఉండటం, అవి కనిపించే విధంగా వైట్ పెయింట్ వేయక పోవడంతో స్పీడ్ బ్రేకర్లు సక్రమంగా కనిపించ లేదు. స్పీడ్ బ్రేకర్లకు రేడియం వైట్ కోటింగ్ చేయాల్సి ఉంది. అటువంటి నిబంధన కూడా పాటించలేదు. ఈ విషయమై స్థానిక ఆర్ అండ్ బి ఇంజనీర్‌ను వివరణ కోరగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదేశాల మేరకు ఇక్కడ స్పీడ్ బ్రేకర్ నిర్మించినట్లు తెలిపారు.

కోటవురట్లలో స్పీడ్ బ్రేకర్‌తో కూడిన రహదారి

రహదారి మధ్యనున్న స్పీడ్ బ్రేకర్

సివిల్స్ ర్యాంకర్ నరేంద్ర పడాల్‌కు సన్మానం

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని అండిబ గ్రామానికి చెందిన ప్రిన్సిపాల్ చిట్టపులి దాల్ పడాల్, విజయా భారతి దంపతుల కుమారుడు చిట్టపులి నరేంద్ర పడాల్ సివిల్స్‌లో 545 ర్యాంకు సాధించడంతో ఘనంగా సన్మానం చేశారు.అండిభ గ్రామం నుంచి చిట్టపులి నరేంద్ర పడాల్‌కు గిరిజన సంప్రదాయ బద్ధంగా దింసా నృత్యాలతో ఊరేగింపు చేసి ఘన స్వాగతం పలికారు. వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, స్థానిక సర్పంచ్ తామర్ల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే రాజారావు, ప్రధాన ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, శనివారం సన్మానించారు. నరేంద్ర పడాల్ మాట్లాడుతూ, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరవచ్చు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సుర్ల అప్పారావు, చీకుమద్దుల సర్పంచ్ సూకూరు బొంజన్న దొర, గన్నేరు పుట్టు మాజీ సర్పంచ్ సూడిపల్లి లక్ష్మీ ప్రమీల, స్థానికులు, కుటుంబ సభ్యులు, తదితరులు, పాల్గొన్నారు.



సన్మానిస్తున్న నాయకులు

నేడు ఎర్నిమాంబ పండగ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జ్ఞానాపురం కాన్వెంట్ జంక్షన్‌లో ప్రసిద్ధి చెందిన శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ బాబా తెలిపారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన శనివారం వెల్లడించారు. అమ్మవారి పండుగను పురస్కరించుకొని ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దామని తెలిపారు. అలాగే ఆలయ ప్రాంగణంతో పాటు కాన్వెంట్ కూడలి నుంచి జ్ఞానాపురం వరకు విద్యుత్ దీపాలతో అలంకరించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. అమ్మవారి పండగ మహోత్సవాల్లో ప్రతి ఏడాదీ అశేష జనావళి పాల్గొంటారని, వారికి ఈసారీ ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని వెల్లడించారు. శనివారం అమ్మవారి తోలేళ్ల మహోత్సవం ఘనంగా జరిగిందని, ఆదివారం అమ్మవారి మహా జాతర మహోత్సవం ఉంటుందని తెలిపారు.